పీర్జాదిగూడ కార్పొరేషన్ బీఆర్ఎస్ నూతన కమిటీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నూతన అధ్యక్షుడిగా బండారి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఏడవల్లి రఘువర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం మంగళవారం మేడిపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యఅతిథిగా మాజీమంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బండారి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గత ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి..

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు 4 నెలలకే ఆవిరై పోవడంతో ప్రజలు అయోమయంలో పడ్డారని మాజీ మంత్రి మల్లారెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఓ వైపు కరెంటు కష్టాలు మరోవైపు సాగునీళ్లు లేక చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు గిట్టుబాటు ధరలేక రైతుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు.

నేడు బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్..

నేడు మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, మహిళలు, పార్టీశ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారి దర్శనం



ఓల్డ్ మల్లాపూర్‌లో ..



మారుతీనగర్‌లో..

జై హనుమాన జ్ఞానగుణ సాగర..



ఉప్పల్/మల్కాజిగిరి జోన్ పరిధిలో హనుమాన్ జయంతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు స్వామివారిని దర్శించుకోగా.. పలుచోట్ల అన్నదానం చేశారు. అనంతరం ప్రశాంత వాతావరణంలో హనుమాన్ శోభాయాత్రలను చేపట్టారు. ఈ వేడుకల్లో రాజకీయ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున స్వామివారి సేవలో పాల్గొన్నారు.

– ఉప్పల్/మల్కాజిగిరి జోన్ల బృందం



బీఎన్‌రెడ్డినగర్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



గౌతంనగర్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



హెచ్‌బీకాలనీలో శోభాయాత్రలో ఈటల రాజేందర్



చర్లపల్లిలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



విజయోత్సవ ర్యాలీలో కార్పొరేటర్ శ్రవణ్



అల్వాల్ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో సీఐ రాహుల్‌దేవ్, డీఐ రాజేందర్‌లు



మల్లన్న దేవాలయంలో..



ఓల్డ్ అల్వాల్‌లో..



పీర్జాదిగూడ వీరాంజనేయ స్వామి దేవాలయంలో..



ఆకుపూజ చేస్తున్న పూజారులు

కూరగాయల వ్యర్థాలతో కంపోస్టు తయారీ



ఉప్పల్: ప్రైవేట్ భాగసామ్యంతో కూరగాయల వ్యర్థాలను ఉపయోగించి కంపోస్టు ఎరువులను తయారు చేయనున్నట్లు ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు తెలిపారు. వీక్లీ మార్కెట్లు, ఉప్పల్ కూరగాయల మార్కెట్లలోని వ్యర్థాలపై రవాణా భారం తగ్గించడంతో పాటు అనేక లాభాలున్నాయన్నారు. దీనిలో భాగంగానే మంగళవారం ఉప్పల్ శాంతినగర్‌లో నిర్వహిస్తున్న కంపోస్టింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ కంపోస్టు యార్డును డీసీ సందర్శించారు. పండ్ల తొక్కలు, మిగిలిన కూరగాయలు, పండ్లు, తదితర వాటి నుంచి (గ్రీన్ వేస్ట్) కంపోస్టు ఎరువుల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లతో పాటు గేటెడ్ కమ్యూనిటీల్లో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోనేందుకు ఇది సులువైన, లాభసాటి మార్గమని నిర్వాహకులు తెలిపారు. త్వరలో ప్రజల్లో అవగాహన తీసుకొస్తామని పేర్కొన్నారు. నిర్వాహకురాలు పావని లోల్ల, డీఈ చందన, శానిటరీ సూపర్‌వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

మోదీని మరోసారి ప్రధానిని చేద్దాం

బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల సతీమణి జమున



ఇంటింటి ప్రచారంలో ఈటల జమున

రామంతాపూర్: మరోసారి మోదీని ప్రధానిని చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఈటల జమున అన్నారు. మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల సతీమణి మంగళవారం ప్రచారంలో పాల్గొన్నారు. రామంతాపూర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ శ్రీవాణితో కలిసి నెహ్రూనగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దూరదృష్టి గల ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోనే భారత్ ముందడుగు వేసి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, బీజేపీ జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు బండి పద్మ, గడ్డంసాయి కిరణ్, బాలకృష్ణ, కుమారస్వామి, నారాయణదాసు, సంతోష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి పార్లమెంట్‌లో 12 నామినేషన్లు

ఎన్నికల అధికారి గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి మంగళవారం 12 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. అలియన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా కామ్రేడ్ సత్యం రెండు సెట్లు, తల్లాడ వెంకటేశ్వర్లు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారన్నారు. భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి తరఫున రెండుసెట్ల నామినేషన్ పత్రాలు దాఖలైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రీయ మానవ పార్టీ అభ్యర్థిగా కె.వి.గీత కుమారి, విడుతలై చిరుతాయిగల్ కట్చ్ అభ్యర్థిగా మంచిని ఆంజనేయులు రెండుసెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారన్నారు. శ్రమజీవి పార్టీ అభ్యర్థిగా జక్కుల నర్సింలు, రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అభ్యర్థిగా కొండా అప్పారావు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారన్నారు. బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా కె.పి.విజయ కుమార్, అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా చేపూరి రాజు నామినేషన్ దాఖలు చేయడం జరిగిందన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా గంటా చరితరావు, దొంతుల భిక్షపతి, ముస్త్యాల రామచంద్రం ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మల్లాది రమాకాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో ఔత్సాహిక విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కోచింగ్ అవసరమైన అంశాలు, మార్గదర్శకాలను విద్యార్థులకు అందిస్తామన్నారు. కేరీర్‌లో విజయం సాధించడానికి సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష–24 కోసం ఈనెల 25 నుంచి ఉచిత కోచింగ్ ఇస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అదనపు సమాచారం, రిజిస్ట్రేషన్‌కు సెల్: 95055 18259, 95502 08072.

ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

డీసీఎం డ్రైవర్ మృతి

ఘట్‌కేసర్: ఓ లారీ డీసీఎంను ఢీకొనడంతో డీసీఎం డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ సైదులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓఆర్ఆర్‌పై అంబర్‌పేట్ వైపు వెళుతున్న లారీ అకస్మాత్తుగా మూడో లైన్ నుంచి నాలుగో లైన్‌కు రావడంతో వెనక వస్తున్న డీసీఎం లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎం డ్రైవర్ ఇల్లాహి షేక్ (60) తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎం క్లీనర్ సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

90 ఏళ్ల వృద్ధుడి అదృశ్యం



సబి ప్రసాద్ (ఫైల్)

లక్డీకాపూల్: జైపూర్‌కు చెందిన సబి ప్రసాద్(90) కనిపించడం లేదని ఆయన కుమారుడు సాబూ హమాన్సు శేఖర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన తాను కొద్దికాలంగా కుషాయిగూడలోని నాగార్జుననగర్ కాలనీలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. నగరాన్ని సందర్శించేందుకు ఇటీవల ఒడిశాలోని బింజ్హాక్‌పూర్ నుంచి వచ్చిన తన తండ్రి కొద్ది రోజులుగా తన వద్దే ఉంటున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంట్లోంచి వెళ్లిపోయారని, పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో కుషాయిగూడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అతడి ఆచూకీ తెలిసిన వాళ్లు కుషాయిగూడ పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కథానవల, ఆంగ్ల నాటక పితామహుడు షేక్స్పియర్ జయంతి సందర్భంగా ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ డా. సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షేక్స్పియర్ 35 ఆంగ్ల నాటకాలు, 150 వరకు సానెట్ పద్యాలు రచించి ఆంగ్ల భాషకు వన్నె తీసుకొచ్చారని కొనియాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన స్థానిక నాయకుడు



సీఎం రేవంత్‌రెడ్డితో మోహన్‌రాజు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు బీ.మోహన్‌రాజు మంగళవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. నాయకులు క్రాంతి కిరణ్, మణి, సచిత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాడతా..!

కాప్రా: జమ్మిగడ్డ శ్మశానవాటిక విషయంలో చివరకు న్యాయమే గెలుస్తుందని న్యాయస్థానం ప్రజలకు న్యాయమే చేస్తుందని జమ్మిగడ్డ శ్మశానవాటిక పరిరక్షణ కమిటీ కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాప్రా మండలంలోని సర్వేనంబర్ 199లోని 12 ఎకరాల స్థల విషయం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందన్నారు. ఈ కేసుపై సుదీర్ఘ విచారణ అనంతరం 2023 ఆగస్టు 14న కోర్టు కొట్టివేసిందని చెప్పారు. సదరు వ్యక్తులు అదే ఏడాది ఆగస్టు 24న హైకోర్టును ఆశ్రయించారన్నారు. 31వ తేదీన కోర్టులో వాస్తవ పత్రాలతో తాను ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశానన్నారు. ఈ కేసులో స్టే నిలిచిపోవడంతో తిరిగి వారు 2024 జనవరి 2న స్టే కోసం వెళ్లి కేసును విత్‌డ్రా చేసుకున్నారన్నారు. తదనంతరం జిల్లా కోర్టులో అట్టి స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని 2024 ఫిబ్రవరి 29న 'స్టేటస్ కో' కు ఆదేశించినట్లు గగన్‌కుమార్ తెలిపారు. ఈ కేసుపై మంగళవారం కోర్టు విచారణ చేపట్టింది. ఈ భూమి ప్రభుత్వ భూమని జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు కౌంటర్ ఫైల్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణను కోర్టు సెప్టెంబర్ 3వ తేదీకి వాయిదా వేసిందని చెప్పారు. జమ్మిగడ్డ శ్మశానవాటిక విషయంలో చివరకు న్యాయమే గెలుస్తుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వేసవిలో ఇమ్యూనిటీకి..

సాక్షి, సిటీబ్యూరో: అధిక స్వేదం, అలసట కారణంగా కోల్పోయే రోగనిరోధక శక్తి తిరిగి పొందేందుకు ఆహారంలో కొన్ని తప్పక చేర్చుకోవాలని ప్రముఖ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి సూచించారు. వేసవిలో ఆరోగ్యం అంశంపై ఓ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనారోగ్యాలను ఎదుర్కొనేందుకు విటమిన్ ఇ, జింక్, ఫోలేట్, ఐరన్ అందించే బాదం పప్పులు అల్పాహారంతో పాటు తీసుకోవాలని, తెల్ల రక్తకణాల ఉత్పత్తికి ఇన్ ఫెక్షన్స్‌ను ఎదుర్కొనేందుకు నారింజ, నిమ్మ, బత్తాయి, ద్రాక్ష వంటి సిట్రస్ పండ్లు వినియోగించాలన్నారు. యాంటీ బాక్టీరియల్ లక్షణాలకు పేరొందిన వెల్లుల్లి, యాంటీ ఆక్సిడెంట్లు అందించే బచ్చలి, మునగాకు, పుదీనా.. తదితర ఆకు కూరలు కూడా వాడాలని సూచించారు.

మద్యం విక్రేతలపై కేసు నమోదు

పోచారం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై పోచారం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. నారపల్లి సమీపంలోని ఎంజేఆర్ స్క్వేర్ మాల్ ఎదుట అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆ ప్రాంతాన్ని పోలీసులు తనిఖీలు చేశారు. అదే చోట జాదవ్ నరేందర్(29) మద్యం విక్రయించడాన్ని పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద లభించిన మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కొర్రెముల బస్టాప్ సమీపంలో ఉన్న ఇంట్లో బెల్టు షాపు నిర్వహిస్తున్న పులిగిల మాధవి(30) వద్ద లభించిన పలు బ్రాండ్ల మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకుని, ఇరువురిపై కేసు నమోదు చేశారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎస్పీనగర్‌లోని కుర్తాళం సిద్ధేశ్వర పీఠ పాలిత శిరిడిసాయి బాబా మందిర ఆవరణలో 24 నుంచి 26 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేకం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 24న గణపతిపూజ, అంకురారోపణ, కలశ స్థాపన, 25 వ తేదీ క్షీరాదివాసం, వారాహి, ప్రత్యంగిరా హోమం, శోభాయాత్ర, 26న విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంభాభిషేకం జరుగుతుందని భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మల్లన్న దేవాలయంలో..

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జుననగర్‌లోని మల్లన్న దేవాలయంలో బుధవారం విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించబడుతుందని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహానంది, ద్వార పాలకులు, చండీశ్వరుడు, సిద్ధి, బుద్ధి వినాయకస్వామి, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వాస్తు గణపతి విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం అన్నప్రసాద వితరణ జరుగనుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకాగలరని వారు తెలిపారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



మల్కాజిగిరి: చైత్రమాసం పూర్ణిమ సందర్భంగా ఆనంద్‌బాగ్‌లోని షిరిడీసాయిబాబా దేవాలయం ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం అర్చకులు సత్య పండిట్ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు సుభాష్, మనోహర్, సమ్మారావు, రామకృష్ణ, మూర్తి, మల్లికార్జున్, నాగమురళి తదితరులు పాల్గొన్నారు.

సేవచేసే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

బోడుప్పల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు సేవచేసే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. విద్యార్థులతో 'అందరం ఓటేద్దాం... మా తల్లిదండ్రులచే ఓటు వేయిస్తాం'.. అనే నినాదంతో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వేయడం అందరి హక్కుగా భావించి ఓటేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో పోటీలో ఉండే ప్రజా ప్రతినిధులు ఇచ్చే ప్రలోభాలకు లొంగకూడదని పేర్కొన్నారు. నేటి భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని చెప్పారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



హెచ్ఎంటీనగర్ వాసులతో పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సమక్షంలో నాచారం హెచ్ఎంటీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులతో సమావేశం నిర్వహించారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని, కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతు తెలిపి గెలిపించాలన్నారు. నాచారం డివిజన్ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్‌గౌడ్, స్థానికులు డాక్టర్ దుర్గప్రసాద్, యాదగిరిరెడ్డి, జనార్దన్, బాల్‌రెడ్డి, ప్రసాద్, తిరుపతి, రాంబాబు, వీరాంజనేయులు, జేఏసీ నాయకులు విజయకుమార్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

ఉప్పల్: హనుమాన్ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా మద్యం షాపులు మూసేయడంతో ఉప్పల్ బీరప్ప గడ్డ ప్రాంతానికి చెందిన ఓ మహిళ బెల్టు షాపు ద్వారా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి దాదాపుగా 30 క్వార్టర్ సీసాల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొత్తగూడెంలో పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్

ముషీరాబాద్: భద్రాది కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 27వ తేదీన పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.సాంబ తెలిపారు. జనరల్ కౌన్సిల్‌కు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు సుమన్, అఖిలేష్, ప్రసాద్, లావణ్య, వైష్ణవి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సాంబ, వెంకట్‌రెడ్డి, సతీష్, రత్నం, రమేష్‌లను పీడీఎస్‌యూ నుంచి బహిష్కరించామని కానీ వారు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పదమని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

ఐపీఎల్ టికెట్ల విక్రయాలపై బీసీసీఐకు ఫిర్యాదు

హిమాయత్‌నగర్: ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల టిక్కెట్ల విక్రయాలపై బీసీసీఐకు ఈమెయిల్ ద్వారా లేఖ పంపించినట్లు మంగళవారం ఏఐవైఎఫ్ నేతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ.. టికెట్లను సెలబ్రిటీలు, ప్రభుత్వ అధికారులకు ఇస్తున్నారని ఆరోపించారు.